# మమత

నిజానికి మా పెద్దబ్బాయి దారి వేరు. నీళ్ళు పోసి అన్నం పెట్టి అవతలకు పంపిస్తే వాడి ఆటలేమో, చదువేమో తప్ప వాడితో ఇక పేచీ ఉండదు. కాని చిన్నబ్బాయితో ముంప తెగిపోతుంది. వాళ్ళనాన్నగారు ఆఫీసుకు పోకుండా ఇంట్లో ఉన్నంతసేపూ కుక్కినపేనులా ఉంటాడు గాని, వారవతలకు పోతే సరి కుబుసము విప్పి రేగుతాడు. మరి వ్వాడడిగే ప్రశ్నలకు జవాబివ్వటం కూడా కష్టమే అవుతున్నది. ప్రొద్దుటూకే సరికి ఒకలక్ష ప్రశ్నలు. పైగా ఒక్క నిమిషం ఊరుకోడు. మాటిమాటికీ ఆ పిల్లిపిల్లల దగ్గరకు పోతాడు. తోకపట్టుకుని గుంజుతాడు. చెవులు పట్టుకొని పైకెత్తుతాడు. ఆ పిల్లిపిల్లలదగ్గరకు వాణ్ని పోనీయవద్దని రోజూ వారు నామీద కసురుకోవడమే. వద్దంటే వీడు మానడు. ఎన్నడూ పల్లెత్తి కటువుగా ఒక్కమాటైనా అనని వారు—పిడీపిల్లలదగ్గరకు పోవడంతో—నా మీద చేయిచేసుకోవడం కూడా జరిగింది.

అయినా అదేమి చిత్రమో, ఆ పిల్లిపిల్లలు కూడా వాడు దగ్గరకుపోయి నానాహింసలు పెట్టినా, కిక్కురుమనవు. మావారు దగ్గరకు వెళ్ళితే తోకలు పైకెత్తి భయంకరంగా అరుస్తూ మెల్లగా ముందుకు వస్తాయి. వారికసలు పిల్లంటే మాచెడ్డ భయం. అందుకనే వారి కాపిల్లుల విషయంలో అంత జాగ్రత్త.

ఆరోజు వారు ఆఫీసునుంచి పెందలాడే వచ్చారు. స్నేహితులతో మొదటాట సినీమాకు వెళ్లారు. పెద్దవాణ్ని కూడా వెంట తీసుకొని వెళ్ళారు. రెండోవాడు నా చెంగుపట్టుకొని "నేనూ పోతా" అని ప్రారంభించాడు' నిదానంగా, "నాన్నగార్ని అడుగూ" అన్నాడు. అసలు రెండోవాడు సినీమాకు వెళ్లటం నాకు ఇష్టంలేదు. ఇంట్లో ఒక్కదాన్ని ఉండటం కష్టంగదూ? అందుకే "నాన్నగార్ని అడగ" మన్నాను. వాడిక మళ్ళీ నోరెత్తలేదు. వారంటే వాడికి వల్లమాలిన భయం.

చిన్నవాడికి అన్నంపెట్టి, దొడ్లో నా దగ్గర పండుకోబెట్టుకున్నాను. వెన్నెల పిండారబోస్తున్నట్టుంది. అంతవరకూ వాడి పళ్లెందగ్గర పప్పూ పెరుగుముద్దలూ మ్రింగి 'మయ్‌మయ్' లాగుతూన్న పిల్లిపిల్లలు కూడా మామంచం క్రింద చేరి చిందులు ప్రారంభించాయి. ఆ రెండుపిల్లల్లో ఒకటి బాగా తెలుపు. రెండోది బాగా నలుపు. నల్లదిగండు. అది అరుస్తుంటే, కొంచెం భయంగా ఉంటుంది. అదంటే మావారికి మరీ భయం, అదంటేనే మా చిన్నవాడికి మరీ ముద్దు. ఉన్నట్టుండి మావాడు నల్లపిల్లిని తెచ్చి నాకూ వాడికీ మధ్య పడుకోపెట్టాడు. తెల్లదికూడా ఒక్కదూకుతో వచ్చి మా మధ్య వాలింది. నాకు ఒళ్లు మండింది. రెండింటినీ రెండు చేతులతో మెడల దగ్గర పట్టుకొని వాకిట్లో విడిచిపెట్టి వచ్చి పండుకున్నాను.

చిన్నవాడు 'మారాం' ప్రారంభించాడు. మొండికి దిగితే వాడితో మహాకష్టం. తలుపు తీసి పిల్లుల్ని లోపలికి రానిచ్చేవరకూ ప్రాణాలు తోడాడు.

ఒక్క నిమిషం మంచంలోపిల్లుల్ని ఒళ్ళు నిమురుతూ కూర్చొన్నాడు. రెండు పిల్లుల్నీ చంకలో పొదువుకొని మెల్లగా పండుకున్నాడు. ఉన్నట్టుండి హఠాత్తుగా లేచాడు

## వి. అనసూయ

అప్పుడే కునుకుపట్టిన నన్ను రెక్కపట్టి అటూ ఇటూ ఊపుతూ లేపాడు. విసుక్కుంటూ "అబ్బా పడుకోరా" అన్నాను.

"అహాఁ, అది కాదమ్మా......మొన్న మొన్నటిదాకా ఇక్కడ కనిపించేదే...ఈ పిల్లి పిల్లల తల్లి. ఇప్పుడు కనపడదేమమ్మా?" అన్నాడు.

"ఎక్కడ చచ్చిందో. పడుకోరా!" అన్నాను.

"అంత పెద్దపిల్లి, అంత బలంగా ఉంటుంది. అది చావనే చావదు. ఎక్కడకు పోయిందమ్మా?" అని నా రెక్క తెగ ఊపుతూ మొదలుపెట్టాడు మారాం. ఓమానాన వాడూరుకోడని నాకు తెలుసు. నాలుగు మాటలు చెప్పి నిద్ర పుచ్చుదామనుకొన్నాను. ఈ పిల్లుల తల్లికి సంబంధించిన కథే మొదలుపెట్టాను.

"నిజంగా, ఈ పిల్లిపిల్లల తల్లి—పుట్టిన తర్వాత పదిహేను రోజుల కనుకుంటాను, ఎంత గండం గడిచి బయటపడ్డదనీ? ఆపిల్లితల్లి బలే పౌరుషం గలది - అంటే ఈ పిల్లల అమమ్మ సంగతన్నమాట నే చెప్పేది.

"అసలు పిల్లి—పిల్లల్ని పెట్టిన తర్వాత కొన్నాళ్ళవరకూ-ఆ దాపులోకి మనుషుల్ని మెసలనీయదు. అప్పుడు దాన్ని చూడడానికే భయమేస్తుంది," అన్నాను.

"అయితే మనుషుల్లో కూడా అంతేనా అమ్మా. మొన్న అత్తయ్యకు బాబు పుట్టినే అత్తయ్యను చూస్తే నాకు భయం పుట్టలేదేం?" అన్నాడు.

"మనుషుల సంగతి వేరు నాయనా. పిల్లలకు కాళ్లు వచ్చిందాకా తల్లిపిల్లి చాలా జాగ్రత్తగా ఉంటుంది. ఇంతకూ ఈ పిల్లి పిల్లల అమ్మమ్మ సంగతికదూ......అది మన దొడ్లోనే రెండు పిల్లల్ని పెట్టింది. అప్పుడు మన యిల్లు ఇప్పటికిమల్లే డాబా కాదు. పూరిల్లు. చుట్టూతా కాకరపాదులు, గుమ్మడితీగలు, సొరతీగలు, పూలమొక్కలు నిండుగా అందంగా ఉండేవి. ఇదుగో ఇప్పుడు స్నానాలదొడ్డి ఉన్నచోట పెద్ద మఱ్ఱి చెట్టు కూడా ఉండేది. దాని మొదట్లో ఒక పాముపుట్ట ఉండేది. అందులో ఒక త్రాచుపాము కూడా ఉండేది. అప్పుడు మన దొడ్లో మంచి మల్లెపూలు పూచేవి. ఆ మల్లె వాసనలకు వెన్నెలరాత్రుల్లో త్రాచుపాము జరాజరా వచ్చి పడగవిప్పి నాట్యంతొక్కేదట!"

మా చిన్నవాడు అంతవరకూ పిల్లిపిల్లల ఒళ్లు నిమురుతూ కూర్చున్నవాడల్లా వాటిని వదిలిపెట్టి నాకుదగ్గరగా వచ్చాడు: "అమ్మా, పిల్లిసంగతి మానేసి, పాము సంగతి చెబుతావేమే!" అన్నాడు.

"అదే చెప్తున్నా రా బాబూ," అంటూ అందుకున్నాను.

"అదంత ధైర్యంగల పిల్లనీ? ఒక రోజున దాని పిల్లల్ని కొరకడానికి గండుబిల్లి వస్తే.. నిజంగా ఆరోజున దానిఉమ్మను చూడాలి. రెండు చెవులూ రిక్కించి, తోక పైకెత్తి, వెంట్రుకలు నిక్కబొడిచి, చెవులు గింగురుమనేట్లుగా అరుస్తూ ఆ గండుపిల్లిని తరిమికొట్టింది! వెంటనే వచ్చి పిల్లలకు పాలిస్తూ పండుకొంది.

"ఆ పిల్లలు దానివంటిమీద కెక్కి దూకుతున్నా ఊరుకుంటుంది. ఒళ్లంతా నాకుతూ వాటిని ముద్దుగా చూచుకునేది. అవంటే దానికెంత ప్రేమనీ? మనుషుల మాదిరే అవి కూడా ఎంతో ప్రేమగా ఉంటై."

"అయితే అమ్మా, ఎంతసేపటికీ తల్లి సంగతే చెబుతావు, వాటి నాన్నసంగతి చెప్పవే?" అన్నాడు.

నాకు సమాధానం చెప్పడం కొంచెం

# ★ మమత ★

కష్టమైంది. చెప్పకపోతే వాడూరుకోడు. "నాన్న వుంటాడు బాబూ, అయితే నాన్న పిల్లలనుగాని పిల్లలు నాన్ననుగాని గుర్తించ లేవు" అన్నాను.

"అదేమిటమ్మా, నాన్న, మనమూ ఒకళ్లనొకళ్లం గుర్తుపట్టడంలా?" అన్నాడు.

"ప్రతిదానికి మనుషుల పోలిక తేబోకురా నాయనా! మనుషులు వేరు పిల్లులు వేరు," అన్నాను.

"మనుషుల మాదిరే క్షేమగా ఉంటా"యనిఅంటే అడిగానులేవే అమ్మా, కోప్పడతావేం?" అన్నాడు వాడు.

"ఒకరోజున మీ నాన్నగారు గుమ్మడి తీగపక్కగా కూర్చొని గుమ్మడి కాయ కోస్తూఉంటే ఆ పక్కనే పిల్లి పిల్లలు కూడా ఉన్నాయి గామాలె......ఎక్కడి నుంచి చూచిందో తల్లి, గబగబా పరుగెత్తుకుంటూ వచ్చి మీ నాన్నగారి ఎడంచేతి మీద పంజావిప్పి కొట్టి కొరకబోయింది. నాన్నగారు పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చారు. అప్పటికి నీవింకా పుట్టలేదు బాబూ! అన్నాయికి నీకుమల్లే ఐదోయేడు."

"అప్పుడేమయిందమ్మా?" అన్నాడు వాడు.

"ఏమయిందీ పెద్ద గంటుపడ్డది. ఇప్పటికీ ఉంది చూడలా?"

"చూచా, అయితే అమ్మా ఈ పిల్లల్ని ఈనినప్పుడు నేను దగ్గరకు పోయినాగదా, తల్లిపిల్లి నన్నేమీ చేయలేదేం?"

"నిన్ను సరిగా చూచిఉండదులే...... అసలు కథ చెప్పనీయకుండా అడ్డుప్రశ్నలు వేస్తావేం?... అన్నయ్యకు ఐదేళ్లప్పుడు, ఒకసారి అత్తయ్యగారూరు పోయి తిరిగి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. అప్పుడు కూడా ఇట్లాగే హాయిగా వెన్నెల కాస్తూంది. నాన్నగారు అన్నయ్య నెత్తుకుని ఉన్నారు. బైట తలుపు తాళం తీయడానికి అన్నాయిని నా చేతికిచ్చారు. నాన్నగారు తలుపుతాళం గబగబా తీసి లోపలి గడప మీద అడుగుపెట్టేరు. గభాలున "అమ్మో" అని ఒక కేకపెట్టి వెనక్కు ఒక్కదూకు దూకారు! మెల్లగా తలుపులు రెండూ దగ్గరకు లాగి నన్ను దగ్గరకుపిల్చి" "నిదానంగా సందులోనుంచి చూడు" అన్నారు. నాకళ్లు బైర్లుగమ్మాయి! నా కాళ్లూ చేతులూ వణికిపోయాయి! ఒళ్ళంతా చెమటలు గ్రమ్మాయి!"

"అబ్బా, ఏం జరిగిందో చెప్పవే..."

"తోకమీద నిలిచి, తలమీద గజం ఎత్తున లేచి పడగవిప్పి పెద్దగా బుసలుకొడుతూ పాము కనిపించింది. బహుశా మనదొడ్లో పుట్టలో త్రాచే నేమో ఇంకా చిత్రం చూడూ, ఆ పాముకెదురుగా చెవులు రిక్కించి, తోక వెంట్రుకలు నిక్కించి గుండెలు పగిలేటట్టు అరుస్తూ వెనుక కాళ్ళమీదలేచి ఈనిన పిల్లి పాము పడగ మీదకు దూకింది. మీ నాన్నగారు "అబ్బాయిని తీసుకొని అవతలకు పద"మని తను తలుపుసందుగుండా చూడ మొదలు పెట్టారు. ఒక ప్రక్క గుండెల్లో భయంగా ఉన్నా, పామూ - పిల్లీ చేస్తున్న యుద్ధం చూడాలని బుద్ధిపుట్టింది."

"అబ్బా, చెప్పవే" అబ్బాయి విసుక్కున్నాడు.

"అరెరెరె, ఏమిచిత్రం! అంత ఎత్తున లేచినపాము ఒక్కసారి భలే విసురుగా పిల్లి తలమీద ఠక్కున కాటువేసింది. పిల్లికి పౌరుషం రేగింది. గోండ్రుమని ఒక్క అరుపు అరిచి, ఒక్కదూకు దూకి, పాము పడుము పట్టుకొని నోటితో కొరక మొదలుపెట్టింది. త్రాచు సర్రున ముందుకుజారి పిల్లి దవడకేసి పడగతో ఒక్కదెబ్బకొట్టింది. పిల్లి రెండడుగులు వెనక్కు వేసింది. ఈసారి త్రాచు తారాజువ్వలా లేచింది. సరిగా పిల్లితలమీద కోర గుచ్చుకుపోయేలా మరొక్క దెబ్బ కొట్టింది, ఠక్కుమన్న మోతకూడా వినిపించింది. పిల్లి పెద్దగా అరిచి బాగా వెనక్కు వచ్చింది. పాముకూడా తోకమీదగా జరిగి ముందుకు రా మొదలుపెట్టింది. మీ నాన్నగారు నా రెక్క పట్టుకొని నాలుగడుగులు వెనక్కు లాగారు.

వెనక్కువచ్చిన పిల్లి చివాలున పైకిలేచి పాముమెడ పడగ క్రిందగా నోటితో పట్టింది. పాము తటాలున క్రిందకుజారి మెరుపుతీగలా అటూ ఇటూ కదులూ పైకిలేచింది. పాము కళ్ళల్లోకి చూస్తూ పిల్లీ, పిల్లికళ్లలోకి చూస్తూ పామూ చెడుగుడులాడినట్లు కదల్లాడాయి. ఉన్నట్టుండి పాము పిల్లిమెడమీద నెత్తురు కారేలాగు ఒక్కదెబ్బ కొట్టింది. పిల్లికళ్లు నిప్పురవ్వల్లా మెరిసిపోతున్నాయి. వెనకాళ్లమీద లేచి ఒక్కసారి త్రాచు పడగ లంకించుకున్నది. పిల్లి నోట్లోనుంచి పడగ లాక్కోలేక పాము తోక నేలకేసి తెగ బాదింది. పిల్లిమాత్రం పట్టువదల్లేదు. పిల్లినోటోనుంచీ నెత్తురుబొట్లు క్రిందపడుతున్నాయి. మా కళ్లు మిరుమిట్లు గొల్పాయి.

"భలే, భలే, అంతే కావాలే" అని మా వాడు చప్పట్లు కొడుతూ అరిచాడు.

"ఆ తర్వాత వినూ! పామేమి చేసిందో, పిల్లిముందు రెండుకాళ్ల మధ్యనుంచీ తోకను పోనిచ్చి పొట్టచుట్టూ తాడు చుట్టినట్లుచుట్టి గట్టిగా బిగించి పారేసింది. పిల్లికి ఊపిరాడ లేదుగామాలె, గభాలున నోరు తెరిచింది. పాము అంతటితో ఊరుకుందా? చిటికెండ్లు పడ్డ పడగ విదిలించుకొని పిల్లి మెడకు కూడా గట్టిగా చుట్టకొన్నది. పిల్లి కదల్లేక మెదల్లేక నోరు తెరిచి అలాగే నిలువబడ్డది. పిల్లితల మీదగా పాము జానెడెత్తు నపడగనెత్తి పిల్లి మాడుమీద టపటపా బాదమొదలెట్టింది. పిల్లిపక్కకు వాలింది.

"అమ్మో, అమ్మో నాకు భయంగా ఉందే" చిన్నబ్బాయి నన్ను గట్టిగా పట్టుకున్నాడు.

"ఆ తరువాత వినూ... పిల్లి మెడచుట్టూ




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పువ్వుము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామా యున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము పొందలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన ఫోకట్టు మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించిచూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

పొట్టచుట్టూ చుట్టుకొన్న పాము మెల్ల మెల్లగా చుట్టలు విదిలించి, కదల్లేక కదల్లేక తలుపువైపుగా కదలి రాసాగింది.

పాము కదలివస్తుంటే మీనాన్నగారి రెక్క నేనూ, నా రెక్క మీనాన్నగారూ పట్టుకొని అలాగే నోళ్లుతెరచి కదల్లేక నిలబడిపోయాం. ఎందుకో కాళ్లు కదిలించబోయినా కదల్లేదు.

"తర్వాతేమైందీ?...గజగజ వణుకుతూనే వాడు నన్నడిగాడు.

"పక్కకు పాముపిల్లి పడిపోయిందనుకున్నావూ...పిల్లి గభాలున ఒక్కదూకు దూకి పాముపడగ నోటితోపట్టి నడుము మీదా, తోకమీదా కాళ్ళుపెట్టి అణిచి పెట్టింది. ఇక పాము కదల్లేకపోయింది. ఇక చూడూ, పిల్లి పాము పడగంతా ఒళ్ళంతా గుడ్డ పీలికలు చించినట్లు చించేసి అటూ ఇటూ విసిరి పారేసింది.

మీ నాన్నగారు సంతోషం పట్టలేక వింతగా ఓ అరుపు అరిచారు. ఏమైనా పిల్లి ఇంట్లో ఉండాల్సిందే అన్నారు, నావీపు తట్టి.

"అతర్వాత ఏమైందే?" అని చిన్నవాడు విసుగుపడ్డాడు.

"ఏమైందీ యుద్ధంలో ఎంతోమందిని చంపి అలిసిపోయి ఠీవిగా ఆనందంగా, తీరుబడిగా కూర్చున్న గొప్ప వీరుడిలాగా పిల్లి వెనకకాళ్లమీద కూర్చొని ముందుకాళ్లు ఆసరాగా నిలిపి అటూఇటూ ఒక్కసారి చూచింది.

దూరంగా బీరపాదుక్రిందగా పిల్లికూన ఒకటి కుయ్‌కుయ్ మంటూంది. పెద్దపిల్లి కూనదగ్గరకు నడవలేక నడవలేక పోయింది. పిల్లికూన తల్లిదగ్గర పాలుతాగ పోయింది. ఒళ్లంతా గంటుపడి నెత్తురు చిమ్ముతూంది. కూన పాదుకు ముట్టలేదు. కూన వొళ్ళంతా తల్లి తన కాళ్ళతో నిమురుతూ లాలనగా పరున్నది.

నేనూ, మీ నాన్నగారూ ఇంకా వాకిట్లోనే ఉండి చూస్తున్నాం. ఇంతలోకే మనపక్కింటి వెంకయ్యబాబాయి "ఏమిట్రా అరగంటనుంచీ చూస్తున్నానులోపలికి పోరూ, బైటకూరారూ ఊరికే తొక్కిస్లాడతారు?" అంటూ వచ్చాడు.

"ఆ ఏమిలా" అంటూ జరిగిన కథంతా చెప్పి మీనాన్న వెంకయ్యబాబాయితో లోపల కడుగుపెట్టారు.

"ఓస్, ఇంతేగదా, పోయే పాము పోకుండా పిల్లికూనల మీదకు ఎగబడ్డదేమో. తల్లి ఊరుకుంటుందా? చీల్చిపారేసిఉంటుంది. చిత్రం చూస్తూ నిలబడ్డారా, అదిలిస్తే పొయ్యేదిగాదూ? ఓరి మీ ఇల్లు బంగారుగానూ, పోయి పడుకోండి" అంటూ వెంకయ్య అవతలకు పోబోయ్యాడు.

"కాస్తా ఈ రాత్రికిక్కడే ఉండండి" అని నేనే అనబోతూ ఉండగా, మీ నాన్నగారే అన్నారు వెంకయ్యతో ఆ మాట.

వెంకయ్య నవ్వుతూనే బీరపాదు పక్కన చుట్ట కాలుస్తూ, పైపంచ పరుచుకొని కూర్చొన్నాడు.

ఒక్కనిమిషం ఆగి వెంకయ్య పెద్దగా కేక పెట్టి, "ఏమర్రోయ్ చూచారా నేను చెప్పలా, అదుగో ఒకకూనను త్రాచు కాటు వేసింది. ఒకటే బ్రతికిఉంది. ఒకటి చచ్చిపడి ఉంది. అందుకనే తల్లి పాముమీద మళ్లబడి ఉంటుంది. ఆహాహా!... ఏమి కృష్ణయ్యా!! విధవ పిల్లికి కూడా పిల్లలమీద ఎంత మమత?" అంటూ అక్కడే ఆవులిస్తూ నిద్రపోయాడు.

"ఇట్లా ఇవతలకన్నా వచ్చి పడుకో బాబాయ్" అని నేనంటున్నా...అట్లాగే పండుకొని ఒక్కనిమిషంలో గుఱక మొదలు పెట్టాడు.

"అయితే అమ్మా, అప్పుడు బతికివున్న కూన...ఇప్పుడీ రెండు కూనలకూ ఏమౌతుందే?" అన్నాడు చిన్నబ్బాయి.

"కనుక్కో" అన్నాను నేను.

"ఓస్, ఇంతేనా? అమ్మవౌతుంది. ఆఁ.... అవునే నేను దాన్నిగూర్చే నిన్నడిగింది. నిన్న మొన్నటిదాకా ఇక్కడే కనిపించిందే ఇప్పుడేమైంది?"

"అవేరా బాబూ వెంకయ్య బాబాయ్ చెప్తున్నాడు నిన్న పొద్దున...నీళ్లు తోడుతుంటే బావిలో ఓ పిల్లిశవం తేలిందట. తీసి బైటపారేశారట. బహుశా వీటి తల్లేమో!" అన్నాను.

"అమ్మా, పిల్లిపిల్లలకు అన్నం ముద్దలు పెడితే నాన్నగారు కోప్పడి కొట్టబోతారే. తల్లి చచ్చిపోయిందిగదా ఈ పిల్లలకు పాలెట్లాగమ్మా, చచ్చిపోవూ? అంటూ వాటిని తనదగ్గరగా లాక్కొని దుప్పటి కప్పుకున్నాడు.

"మా బంగారు తండ్రి మనస్సు ఎంత మెత్తనిది!" అంటూ మెల్లగా కునుకు తీస్తున్న చిన్నబ్బాయితల ముద్దుపెట్టుకున్నాను.

"ఇదుగో! తలుపు" అంటూ బయటినుంచి మావారి గొంతుఖంగున మ్రోగింది. గడియతీయడానికి మెల్లగా లేచి ఇవతలకొచ్చాను. ★



గొంతు నొప్పి
శమనానికి
పెప్స్‌ను సేవించుడు

గొంతునొప్పి, దగ్గులు, జలుబులు, ఇన్ఫ్లూయంజ మరియు రొమ్ము పడిసెముకు దారి తీస్తుంది— మీరు తక్షణం పెప్సును సేవించకపోతే. పెప్సులోని శమనకర, అంటు విరోధక ఔషధ పారములు, గుండెలు ఊపిరితిత్తులలోకి లోతుగా చొచ్చి, కఫమును పలుచనజేసి మంటతో గూడిన నొప్పును శమనపర్చును. డాక్టర్లు పెప్సును సిఫారసుచేసియున్నారు, హానికర ఔషధులు ఇందు లేవు.



PEPS

పెప్స్ గొంతు మరియు గుండెం అంటు విరోధక బిళ్లలు

PPY-40-TEL

సోల్ ఏజెంట్లు : దాదా & కంపెనీ,
86, సైనప్పన్‌నాయకన్‌వీధి, మద్రాసు.




మరియు హైదరాబాదు.

అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2.
(దక్కన్)